క్లుప్తంగా

యూరియా కోసం బారులు


చేగుంటలో యూరియా కోసం రైతుల బారులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని మక్కరాజీపేట రోడ్డులోని రైతుసేవా కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం గురువారం బారులు తీరారు. ఉదయం యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు.. గ్రామాల నుంచి చేగుంటకు చేరుకున్నారు. అప్పటికీ యూరియా రాకపోవడంతో రైతులు క్యూలో నిలిచి ఉన్నారు. తర్వాత లారీ లోడు రావడంతో యూరియా తీసుకెళ్లారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

రేగోడ్(మెదక్): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 80మంది విద్యార్థులకు బీఆర్ఎస్ పోచారం గ్రామ అధ్యక్షుడు బాలయ్య గురువారం టై, బెల్టు, ఐడెంటీ కార్డులను అందజేశారు. సొంత ఖర్చులతో తన వంతుగా విద్యార్థులకు సాయం చేశానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గుర్నాథ్, హెచ్ఎం సుశీల, మాజీ సర్పంచ్‌లు నర్సింహులు, రమేశ్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, ఆర్టీసీ రిటైర్డ్ ఏడీఏ జైశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్, హత్నూర మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు చెక్కులను నర్సాపూర్‌లో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, నయీమ్, ప్రసాద్, రాంచంద్రరెడ్డి, ప్రవీణ్, కర్ణాకర్, తదితరులు ఉన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం


శివలింగకు ఆర్థిక సహాయం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్‌గిద్దకు చెందిన బ్రాహ్మణపల్లికి చెందిన పేద విద్యార్థి శివలింగకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో సీఈసీ గ్రూపులో సీటు వచ్చింది. దీంతో అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో పెద్దశంకరంపేటకు చెందిన విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు ఛైర్మన్, కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్‌ను సంప్రదించగా అతడి చదువుకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అతడి చదువు కోసం భరోసా ఇచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యంతో పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం హద్నూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హద్నూర్ ఎస్ఐ దోమ సుజిత్ సిబ్బందితో కలిసి మండలంలోని గంగ్వార్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో టవేరా వాహనంలో 16 బస్తాల రేషన్ బియ్యాన్ని కర్నాటక ప్రాంతానికి తరలిస్తున్న సునీల్‌కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ బియ్యం లబ్ధిదారుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి కర్నాటకకు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన 16 బస్తాల బియ్యం 8క్వింటాళ్ల వరకు ఉంటాయన్నారు. బియ్యాన్ని దిగ్వాల్‌లోని ఏఎంసీ కేంద్రానికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు మాంసం దుకాణాలు బంద్

నారాయణఖేడ్: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని రకాల మాంసం దుకాణాలను మూసేయాలని కమిషనర్ జగ్జీవన్ దుకాణ యాజమానులకు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా మాంసం దుకాణాలు తెరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బస్టాండ్ లేక బాధలెన్నో..!


నార్సింగిలోని జాతీయ రహదారిపై బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

చిన్నశంకరంపేట(మెదక్): బస్టాండ్ సౌకర్యంలేక జనం అవస్థలు పడుతున్నారు. బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు వానొస్తే పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నార్సింగి మండల కేంద్రంలో జాతీయ రహదారిపై బస్సుల కోసం వేచిచూస్తు ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తూ తిప్పలు పడుతున్నారు. నిజామాబాద్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న నార్సింగి మండల కేంద్రంలో రోజు వందలాది మంది బస్సు కోసం వేచి చూస్తు గంటలకొద్ది రహదారిపై నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఆ సమయంలో వర్షం వస్తే పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే.. కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని దుస్థితిని ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు. నార్సింగి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రామాయంపేట, చేగుంట మండల కేంద్రాలతో పాటు ప్రధాన నగరాలకు వెళ్లేందుకు వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాలలో, పాఠశాలల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు, విద్యార్థులు ఉదయం, సాయంత్రం బస్సు కోసం గంటల కొద్దీ రహదారిపై వేచి చూస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ఉన్న మండల కేంద్రాలలో బస్టాండ్ నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సత్ప్రవర్తనతోనే సానుకుల దృక్పథం


గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

ఆర్డీఓ జయచంద్రారెడ్డి
- బాలుర గురుకుల పాఠశాల సందర్శన
- విద్యార్థులతో కలసి భోజనం

తూప్రాన్: ప్రతి విద్యార్థి వ్యక్తిగత సత్ప్రవర్తనతో మెలగాలని, అప్పుడే జీవితం మీద సానుకుల దృక్పథం ఏర్పడుతోందని ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అలవర్చుకోవాలని సూచించారు. వ్యక్తిగత సత్ప్రవర్తన సంతృప్తిని కలిగిస్తుందని, పైగా మంచి పౌరులుగా తయారు కావడానికి దోహదపడుతుందని ఉద్బోధించారు. వీసీటీ, ఐటీసీ, స్థానిక కంపెనీల సహకారంతో పాఠశాలలో విద్యార్థుల సమస్యలను గుర్తించి పరిష్కరించినట్లు తెలిపారు. ఫలితంగా విద్యార్థులను చదువులతో పాటు క్రీడల్లో రాణించడం గర్వించదగిన విషయమని కొనియాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు సెలవుల్లో పాఠశాలను సందర్శించిన సందర్భంలో వారికి వసతులు కల్పించడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సైతం తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రజల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణాలు, డివిజన్లకు సంబంధించిన 41 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి పథకం ద్వారా మంజూరైన రూ.16,57,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం సీఎం త్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి నెల లక్షల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు.


ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జహీరాబాద్ క్యాంపు కార్యాలయంలో..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రూ.8.34 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. జహీరాబాద్ మండలంలోని 7 మందికి రూ. 1.90 లక్షలు, మున్సిపల్ పరిధిలో 8 మందికి రూ. 2.25 లక్షలు, కోహీర్ మండలంలో 11 మందికి రూ. 4.19 లక్షల చెక్కులు అందజేశారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలి


నారాయణఖేడ్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


తిరంగా ర్యాలీలో గోదావరి, నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

పటాన్‌చెరు టౌన్: ప్రజల్లో జాతీయభావం పెంపొందించేందుకే హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీ పార్క్ నుంచి పలు వీధుల మీదుగా జాతీయ జెండాతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో ర్యాలీ నిర్వహించమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నాగసాని నరేష్, పట్టణ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో..

నారాయణఖేడ్: ఖేడ్‌లో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు సిందోల్ దశరథ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్ చౌక్ నుంచి ప్రధాన రహదారుల గుండా ర్యాలీ సాగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ మాట్లాడుతూ యువతలో జాతీయత, దేశభక్తి పెంపొందించాలనే లక్ష్యంతో ర్యాలీ చేపట్టామన్నారు. పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

పలు రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు

పాపన్నపేట(మెదక్): అనుమానిత వస్తువులు కనిపిస్తే, వాటిని ముట్టకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సూచించారు. గురువారం ఆయన డాగ్ , బాంబ్ స్క్వాడ్‌లతో కలసి పాపన్నపేటలోని పలు రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పండుగల పూట సంఘ విద్రోహశక్తులు అలజడి సృష్టించడానికి ప్రయత్నించ వచ్చని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు.

మంజీరా వైపు ఎవరూ వెళ్లొద్దు

తహసీల్దార్ తులసీరాం

టేక్మాల్(మెదక్): వర్షాల కారణంగా నీటి ప్రవాహం ఉధృతంగా ఉందని, మంజీరా నది పరివాహక ప్రాంతానికి ఎవరూ వెళ్లకూడదని తహసీల్దార్ తులసీరాం తెలిపారు. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయని, గుండువాగుతో పాటు ఇతర వాగులు సైతం ఉధృతంగా పారుతున్నాయని జలాశయాల వైపు ఎవరూ వెళ్లకూడదని చెప్పారు. విద్యుత్ స్తంభాల వద్ద, కూలిపోయిన ఇళ్ల వంటి ప్రదేశాలలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాతావరణంలో మార్పు కారణంగా కలుషితమైన నీరు, ఆహారం తీసుకోకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో అధికారులను సంప్రదించి వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

రామాయంపేట(మెదక్): మెదక్ నుంచి రామాయంపేటకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్థానిక పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా పట్టుకొని టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

అల్లాదుర్గం(మెదక్): మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మల్లయ్య అన్నారు. శిథిలమైన ఇళ్లలో ఉండకూడదని, పాఠశాలలు, కమ్యూనిటీహాల్స్‌లో ఉండాలన్నారు. పెంకుటిళ్లు ఉరుస్తుంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. వరదలు అధికంగా వచ్చే చోట కాలువల్లోకి దిగవద్దన్నారు.

వాలీబాల్ పోటీలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

చిన్నశంకరంపేట(మెదక్): ఈ నెల 18, 19న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొనేందుకు చిన్నశంకరంపేట మండలం మడూర్ జెడ్పీపాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో మెదక్ జిల్లా జట్టు తరపున పాల్గొనేందుకు మడూర్ జెడ్పీపాఠశాల నుంచి బాలుర జట్టుకు రేవేష్, సమంత్ (10వ తరగతి) ఎంపికయ్యారు. అలాగే బాలికల జట్టుకు అక్షత, హిమజ (9వ తరగతి, లిఖిత(10వ తరగతి) ఎంపికైనట్లు పాఠశాల పీడీ అల్లి నరేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం రవిందర్‌రెడ్డి అభినందించారు.

వరి పంటను పరిశీలించిన విద్యార్థులు


శీలాంపల్లిలో వరి మొక్కల మధ్యన దూరాన్ని కొలుస్తున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వరి పంటలో బయోమెట్రిక్ పరిశీలించామని, రైతులు ఏ విధమైన పద్ధతిలో వరిసాగు చేస్తున్నారనే విషయాలను తెలుసుకున్నామని మల్లారెడ్డి యూనివర్శిటీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. గురువారం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లిలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వరిలో బయోమెట్రిక్ పరిశీలనలో భాగంగా మొక్కల మధ్య ఎంత దూరం ఉండాలో, మొక్కల ఎత్తు, పిలకల సంఖ్య, ఆకుల సంఖ్య తెలుసుకున్నామని చెప్పారు. ఈ విధమైన సమాచారంతో పంట ఆరోగ్యం, దిగుబడి అంచనా వేయొచ్చన్నారు. పంట పెరుగుదల దశలను తెలుసుకోవడం మూలంగా ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం అవసరానికి ఉన్నంత వినియోగించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు లతాశ్రీ, దేవిక, చందన, అక్షయ.అశ్విని, భావన, భవాని, శ్వేక పాల్గొన్నారు.

శ్మశానవాటిక కూల్చివేతపై రజకుల ఆగ్రహం


మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): వారసత్వంగా ఉన్న బొందలగడ్డ వద్ద శ్మశానవాటిక దహన సంస్కారాలకు గద్దెను నిర్మించుకుంటే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా కూల్చివేయడంపై రజకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు సోమేశ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరైనా రజక కులస్తులు చనిపోతే గ్రామానికి సమీపంలోని జాతీయ రహదారి పక్కన అంతిమ సంస్కారాలు నిర్వహించేవారు. గతంలో రైలు దుర్ఘటనలో విద్యార్థులు మృతిచెందిన చోటు వద్దే రజకుల శ్మశానవాటిక ఉండేది. రైలు దుర్ఘటన ప్రదేశంలో అధికారులు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లడానికి వీలుగా రజకుల సమాధులను తొలగించి బైపాస్ రోడ్డును నిర్మించారు. దీంతో మిగిలిన ప్రదేశంలో రజకులు దహన సంస్కారాలు నిర్వహించుకునేలా దహన వాటిక నిర్మాణం చేపడుతుంటే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రాత్రికిరాత్రే ధ్వంసం చేశారని ఆయన వాపోయారు. అధికారులు స్పందించి శ్మశానవాటిక కోసం వేరే చోట స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

డ్రగ్స్ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఎస్ఐ.ప్రవీణ్‌రెడ్డి


పెద్దశంకరంపేటలో పోలీసుల తనిఖీలు

పెద్దశంకరంపేట(మెదక్): నిబంధనలకు విరుద్ధంగా మాదకద్రవ్యాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ.ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం పెద్దశంకరంపేటలో జిల్లా ప్రత్యేక బాంబ్ స్క్వాడ్ సిబ్బంది, జాగిలాలతో కలిసి బస్టాండ్, ఆర్టీసీ బస్సులు, పలు దుకాణాలు, మార్కెట్‌లో ప్రయాణికుల వద్ద బ్యాగులను తనిఖీ చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ రవాణా, అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది భిక్షపతి, సిద్ధు, షౌకత్‌అలీ, రమేష్‌కుమార్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు


చిల్వేర చౌరస్తాను పరిశీలిస్తున్న సీఐ, అధికారులు

సీఐ రేణుకారెడ్డి

అల్లాదుర్గం(మెదక్): ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతామని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి చెప్పారు. గురువారం చిల్వేర గ్రామం వద్ద ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రాంతాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంతెనల వద్ద మూల మలుపుల వద్ద జాగ్రత్తగా నిదానంగా వాహనాలు నడపాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించాలని ఆమె అధికారులకు సూచించారు. జాతీయ రహదారిని దిగ్బంధం చేసి రాస్తారోకో చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇష్టారాజ్యంగా రహదారులపై నిరసనలు తెలుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్, అల్లాదుర్గం ఎస్ఐ శంకర్ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

ఏఓ శ్రీనివాస్‌గౌడ్



కంది(సంగారెడ్డి): రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని కంది మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం కంది మండలం బేగంపేటలో ఎరువులు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణం బయట స్టాక్‌కు వివరాలు, విక్రయిస్తున్న ధరల పట్టికను పెట్టాలన్నారు. ఈపీజీఎస్ ద్వారా రైతుల ఆధార్‌కార్డును నమోదు చేసి ఎరువులను విక్రయించాలన్నారు. అలాగే, రైతులకు బిల్లులను తప్పకుండా ఇవ్వాలన్నారు. ప్రస్తుతం మండలంలో 60 మెట్రిక్ టన్నుల యూరియా, 45 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు పంటలకు అవసరమైన మేరకే ఎరువులు, మందులను వినియోగించాలని, అధిక మోతాదులో వాడడం వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అప్రమత్తంగా ఉండాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులో చాముండేశ్వరీ ఆలయ ఆవరణలోని మంజీరా వాగును సందర్శించే భక్తులు, మంజీరా పరివాహక ప్రాంతంలో పంట పొలాలు గల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నర్సింహులు సూచించారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగూరు ప్రాజెక్టు నుంచి నీరు వదలడంతో వాగు ఉధృతంగా పారుతుందని, పైగా భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో పరివాహక ప్రాంతం వైపు ఎవరూ వెళ్లొద్దన్నారు.

◆ హుండీ ఆదాయం రూ.7.43 లక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ దేవి ఆలయం హుండీని గురువారం లెక్కించినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు తెలిపారు. నాలుగున్నర నెలలకు సంబంధించిన హుండీని లెక్కించగా.. రూ.7.43 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు శ్రీనివాస్,, వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు శ్రీనివాస్‌రెడ్డి, రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

◆ పేదలకు అందని వైద్యం

అల్లాదుర్గం(మెదక్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారని అల్లాదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షుడు బ్రహ్మం అన్నారు. అల్లాదుర్గం ఆరోగ్య కేంద్రం డాక్టర్ హైదరాబాద్‌లో ఉంటూ విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారని, దీంతో నిరుపేద రోగులకు వైద్యం అందడం లేదన్నారు. జిల్లా వైద్యాధికారులు, కలెక్టర్ తనిఖీకి వచ్చేటప్పుడు మాత్రం ముందే ఎలా ఉంటున్నారో అధికారులకే తెలియాలన్నారు. పేద రోగులకు సరైన వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ మాదకద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు

రేగోడ్(మెదక్): అక్రమంగా మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పోచయ్య హెచ్చరించారు. మండల కేంద్రమైన రేగోడ్, టి.లింగంపల్లి గ్రామాల్లోని పలు దుకాణాల్లో గురువారం నార్కోటిక్ బాంబు స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ పాన్ షాపుల పేరుతో నిషేధిత మాదక ద్రవ్యాల విక్రయాన్ని ఎలాగైనా అరికట్టాల్సిందేనని చెప్పారు. పాన్ షాపు యజమానులు నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

◆ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్: భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి అన్నారు. వర్షాల కారణంగా ఏదైనా ప్రమాదం జరిగినా, ప్రాణ, ఆస్తి నష్టం జరిగినా నర్సాపూర్ డివిజన్ కంట్రోల్ రూమ్ నంబర్: 99485 85072కు ఫోన్ చేసి తెలియాలని సూచించారు.

◆ మాదకద్రవ్యాలపై అవగాహన

మునిపల్లి(అందోల్): లింగంపల్లి బాలుర గురుకుల పాఠశాలలో గురువారం మాదకద్రవ్యాల నియంత్రణపై మునిపల్లి పోలీసులు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ.జగదీశ్ మాట్లాడుతూ గంజాయి, గుట్కా, తంబాకు, వైన్ వంటి వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.